క్లుప్తంగా

బీజేపీ కుట్రలను అడ్డుకోవాలి

గట్టు: బీజేపీ కుట్రలను అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నట్లు బీఎస్పీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బండారి రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపించారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నాగర్‌కర్నూలు పార్లమెంట్ నుంచి గెలిపించుకుందామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రకాష్, బోయ రవి, దానియేలు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు వితరణ



అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయ క్రీడా మైదానంలో శనివారం బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలకు చెందిన కబడ్డీ జట్టుకు ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అశోక్, యుగేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బుడుగ జంగాల జిల్లా అధ్యక్షుడు మారెప్ప, బీఆర్‌ఎస్ నాయకుడు అంజిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు శనివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి జూపల్లిని కలిసి పూల బొకే, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సీఐని సన్మానించిన ఎంఐఎం నాయకులు



శాంతినగర్: సర్కిల్ కార్యాలయం శాంతినగర్‌కు కొత్తగా వచ్చిన సీఐ రత్నంను అలంపూర్ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు కలీముల్లా శనివారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల శాంతినగర్ ఎస్‌ఐగా వచ్చిన సంతోష్‌కు శాలువా, పూలమాలతో సన్మానించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ సమస్యల గురించి పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు. రంజాన్ మాసం దగ్గరలో ఉన్నందున పోలీసుల సహకారం ఉండాలని సీఐ, ఎస్‌ఐలను కోరారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎమ్మెల్యే కుటుంబం



అలంపూర్: ఎమ్మెల్యే విజయుడు, ఆయన సోదరులు, కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కర్నూల్‌లో నివాసమున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎమ్మెల్సీ సర్వ శక్తులు ఒడ్డి విజయానికి తోడ్పాటును అందించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన సోదరులతోపాటు కుటుంబ సభ్యులతో ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయడానికి సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు.

జాతర సందర్భంగా బందోబస్తు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువు మధ్యలో ఉన్న పరమేశ్వరస్వామి ఆలయం వద్ద నీటి ఉధృతి ఉండడంతో ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. శనివారం పరమేశ్వరస్వామి ఆల య పరిసరాలను పరిశీలించారు. ఆలయ పూజారి కర్పసయ్య, భక్తులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన లు చోటు చేసుకోకుండా బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు సావధానంగా నీటిలోకి వెళ్లకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించుకోవాలని సూచించారు.

ఆయాలు లేక అవస్థలు

- ఏళ్లుగా అంగన్‌వాడీలో కేంద్రాల్లో ఖాళీలు
- తగ్గుతున్న చిన్నారుల సంఖ్య
- ఆయాలను నియమించలంటున్న ప్రజలు



మానవపాడులో అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత

మానవపాడు: చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాల్లో ఆయాలు కరువయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన విమర్శలున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాల్లో దాదాపు 226 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. 12 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నా యి. అయా అంగన్‌వాడీ సెంటర్లలో 9,019మంది 3 ఏళ్ల చిన్నారులు, 7,811 మంది మూడు నుంచి ఆరేళ్ల మధ్య చిన్నారులు ఉన్నారు. గర్భిణులు 2,545 మంది, బాలింతలు 2,401 మంది ఉన్నారు. వారి బాగోగులు చూసుకోవల్సిన 52 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా కేంద్రాలకు వచ్చే పిల్లలు, బాలింతలకు, గర్భిణులకు సరైన సేవలు అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఆయా పోస్టులు ఖాళీతో ఇబ్బందులు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు చిన్నారులకు ఆటపాటలు చేబుతుండగా ఆయాలు చిన్నారులను ఇంటి నుంచి కేంద్రాలకు తీసుకురావాలి. ఉదయం కేంద్రాలకు వచ్చి శుభ్రం చేయాలి. మంచి నీరు, వంటకు కావాల్సిన ఏర్పాటు చేయాలి. చిన్నారులు గైర్హాజరైతే వారి ఇళ్లకు వెళ్లి తీసుకురావాలి. వంట చేయడంతో పాటు కేంద్రంలోని ప్రతి చిన్నారికి భోజనం, గుడ్డు అందించాలి. బాలింతలకు బాక్సుల్లో భోజనాలు పెట్టాలి. అంగన్‌వాడీ టీచర్లు ఏదైనా సమావేశాలకు వెళ్లినా, సెలవుల్లో ఉన్నా చిన్నారుల ఆలన, పాలన చేసుకోవాలి. మండలంలోని ఆయా గ్రామాలలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులను భర్తీ చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చిన్నారితో మాట్లాడుతున్న సుజాత

ఏళ్లుగా ఆయా పోస్టు ఖాళీ



అంగన్‌వాడీ కేంద్రంలో పని చేసే ఆయా పోస్టులు చాలా ఏళ్లుగా ఖాళీగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆలన, పాలన చూసుకోవాల్సిన ఆయా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి కారణం. చిన్నారులు మరుగుదొడ్డికి వెళ్లినా వారిని పట్టించుకునేవారు లేరు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కడైతే ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయో వాటిని పూర్తి చేయాలని కోరుతున్నాం.

– రజిత, చిన్నారి తల్లి, చెన్నిపాడు

ప్రభుత్వం ఆయా పోస్టులను పూర్తి చేయాలి



కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో ఆయా పోస్టుల ఖాళీగా ఉన్నవాటిపై దృష్టిపెట్టి వాటిని త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. చాలా రోజులుగా అంగన్‌వాడీ సెంటర్లలో ఆయాలు లేని సెంటర్లలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నాం.

– బజారన్న, మానవపాడు

ఉన్నతాధికారులకు నివేదించాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. ఆయాలు లేని కేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే ఆయా పోస్టులను పూర్తి చేస్తాం.

– సుజాత, ఐసీడీఎస్, సీడీపీఓ,మానవపాడు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



అయిజలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

అయిజ: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో వేదపండితులు వేదమంత్రాలతో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం కన్నులారా చూసేందుకు భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. శనివారం తెల్లవారుజామువరకు శివనామస్మరణతో ఆలయపరిసరాలు మార్మోగాయి. భక్తులకు ఆయల కమిటీ వారు తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వసతి కల్పించారు.

కనుల పండువగా రథోత్సవం



సింధనూరులో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



పర్దీపురంలో రథోత్సవానికి హాజరైన భక్తులు

అయిజ: శివరాత్రి సందర్భంగా మండలంలోని సింధనూరులో, మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురంలో శనివారం రాత్రి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. రథంపై ఊరేగుతున్న శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శివ నామస్మరణతో రెండు గ్రామాలు మార్మోగాయి. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ వారు భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.



మురికి నీరు, పాకరతో దుర్గంధంగా మారిన జూరాల కుడికాల్వ





జిల్లా కేంద్రంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని జూరాల కుడికాల్వ దుస్థితి

మురుగు కాల్వ కాదు.. జూరాల కుడి కాల్వ

ఈ చిత్రాలు ఏదో మురుగు కాల్వ అనుకొంటే పొరపాటే.. ఇదీ ముమ్మాటికీ జూరాల కుడికాల్వ. అయితే ఈ కాల్వ ద్వారా జమ్ములమ్మ రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి పట్టణ ప్రజలకు అందిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో కాల్వలో నీరు పారకపోవడంతో ఇలా పట్టణంలోని మురుగు నీరు పారుతూ వ్యర్థాలతో దుర్గంధంగా మారింది. తాగునీటి కోసం నీటిని విడుదల చేస్తే ఈ మురుగునీరు పట్టణ తాగునీరుగా మారుతోంది. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించి కాల్వలోని డ్రైనేజీ నీరు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అందులోని పూడికతీతతో పాటు వ్యర్థాలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ దృశ్యాలు శుక్రవారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– గద్వాల అర్బన్

పశువులకు టీకాలు వేయించండి



అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. శనివారం మండలంలోని ఈడుగోనిపల్లిలో 161 పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. పశువులన్నిటికి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

పశువుల సంరక్షణ కోసం టీకాలు

శాంతినగర్: పశువుల సంరక్షణ కోసమే వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడకుండా రక్షించుకుంటే మనకు ఆర్థిక చేయూతతో పాటు వ్యవసాయ పనులు చక్కగా కొనసాగుతాయన్నారు. గ్రామంలోని 33 మంది రైతులకు చెందిన 478 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాదన్, ఓఎస్ రవికిరణ్, గోపాలమిత్ర లక్ష్మన్నలు పాల్గొన్నారు.

11న లెప్రసీ సర్వే



మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం లెప్రసీ సర్వే ఈ నెల 11 నుంచి ప్రారంభం అవుతుందని డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు లెప్రసీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి ఉదయం 6గంటల నుంచి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి లెప్రసీ గురించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనుమానిత వ్యక్తుల లిస్టను తయారు చేసి ఆరోగ్యకేంద్రానికి పంపుతామన్నారు. డాక్టర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి లెప్రసీని నిర్ధారణ అయితే వారికి ఉచితంగా 6నెలలు మందులు పంపిణీ చేస్తామన్నారు. సత్యానారాయణ, హెలెన్, చంద్రన్న, తిరుమాల్‌రావు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశలు పాల్గొన్నారు.

విజ్ఞానం నింపిన వైజ్ఞానిక ప్రదర్శన



గద్వాల: చిన్నతనంలో శాస్త్రీ, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తేనే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు. శనివారం ఎస్‌ఆర్ విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యార్థులు సృజనాత్మక ప్రయోగాలు చేపట్టారు. వైజ్ఞానిక ప్రదర్శనను పాఠశాల డైరెక్టర్లు శ్రీకాంత్ జోషి, రాముడు ప్రారంభించారు.

చెత్త సేకరణకు డబ్బు వసూలు చేయరాదు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల అర్బన్: గద్వాల మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు ప్రజల వద్ద నుంచి డబ్బు వసూలు చేయరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మున్సిపాలిటీ నుంచి ఆటోల ద్వారా చెత్తను సేకరించి వారిని అందుకు సంబంధించిన ఖర్చులను మున్సిపాలిటీనే భరించేదన్నారు. ప్రస్తుతం చెత్త సేకరించే పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించి ఒక్కో ఇంటికి నెలకు రూ.60నుంచి రూ.100వరకు వసూలు చేస్తున్నారన్నారు. ప్రజలపై భారం మోపే ఈ పద్ధతిని మానుకోవాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చెపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు వీవీ నర్సింహ, ఉప్పేరు నర్సింహ, దేవదాసు, ఈదన్న, ఆంజనేయులు, బాలకృష్ణ, తిమ్మప్ప ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



మానవపాడులో భూమిపూజ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మానవపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటిలు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోడ్ల నిర్మాణానికి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నాణ్యతతో నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భారత్‌భూషణ్‌రెడ్డి, బ్రహ్మేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, భీమ్‌రెడ్డి, ప్రభాకర్, పరమేష్‌నాయుడు, రాఘవరెడ్డి, తలారి వెంకటన్న, శేఖర్, రామకృష్ణ, మల్లేష్, శ్రీను, శ్రీనివాసులు, వెంకట్రాముడు, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

విజయ సంకల్ప సమ్మేళనం విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న

అయిజ: ఈనెల 12న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ నేతలు తలపెట్టిన విజయ సంకల్ప సమ్మేళనం విజయంతం చేద్దామని బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. విజయ సంకల్ప సమ్మేళనం కార్యక్రమానికి బూత్‌లెవల్ అధ్యక్షులు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వివిధ మోర్చల నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్య శెట్టి, కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నర్సన్నగౌడ్, మండల ఉపాధ్యక్షుడు భీమన్న, అంజి, గోపాల్, శశిధర్, రవి, ప్రనేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఎండుతున్న వరి, శనగ పంటలు



కేటీదొడ్డిలో ఎండుతున్న శనగపంట

కేటీదొడ్డి: సాగునీరు లేక వరిపొలాలు ఎండుతున్నాయి. ర్యాలంపాడు ద్వారా నీటిని విడుదల చేయాలని మండల రైతులు కోరుతున్నారు. నీరులేక వరి, శనగపంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ర్యాలంపాడు ద్వారా నీటిని అందించాలని రైతులు కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



మల్దకల్‌లో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్దకల్: మండల కేంద్రంలో ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, రామకృష్ణలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుతో ఆలయానికి వచ్చే భక్తులకు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడే ప్రధాన లక్ష్యమన్నారు. నాయకులు గోవిందు, రఘుపతి, మల్లికార్జున్‌గౌడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా శనివారం వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు కార్యదర్శికి పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, రవి, రంజిత్, రాంబాబు, గ్రామస్తులు ఉన్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



ఇటిక్యాలపాడులో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులోకి వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ కంచెలేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ప్రజలు, వాహనదారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు తక్షణమే రక్షణమే కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎల్లమ్మ వైన్స్‌లో గొల్ల చిన్న రాముడు, గొల్ల రామకృష్ణలు మద్యం తాగడానికి వెళ్లగా, కుర్వ స్వాములు దాడి చేశాడు. దీంతో చిన్న ఆముదాలపాడుకు చెందిన రామకృష్ణకు తలకు బలమైన గాయమైంది. శనివారం చిన్న రాముడు ఫిర్యాదు చేయడంతో కుర్వ స్వాములుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు.